అక్షరాలా అది ప్రైవేట్ పాఠశాల..
ఫీజులు చెల్లిస్తేనే గాని చదువు చెప్పని సంస్థ..

ఆ ప్రైవేటు పాఠశాలకు ప్రజాప్రయోజనాల కోసం కేటాయించిన స్థలంలోవీఎంఆర్‌డీఏ రూ. కోటిన్నర వెచ్చించి భవనం నిర్మించింది. ప్రజలు అభ్యంతరం తెలిపినా పట్టించుకోలేదు. స్థానికులు నిరసన తెలిపినా ఖాతరు చేయలేదు. మూడంతస్తుల భవనాన్ని సదరు ప్రైవేటు పాఠశాల యాజమాన్యానికి అప్పగించింది. పాఠశాల బోర్డు కూడా వెలసింది.

ఆదర్శ పై ఎందుకంత ప్రేమ!

స్థానికులు అడ్డు తగిలినా బేఖాతర్

ప్రైవేట్ పాఠశాలకు వీఎంఆర్‌డీఏ నిధులతో భవనం


గాజువాక వినాయకనగర్‌లో వీఎంఆర్‌డీఏ నిర్మించి పాఠశాలకు అప్పగించిన భవనం

గాజువాక:

గాజువాకలోని వుడా కాలనీ వినాయకనగర్‌లోని షాపింగ్ కాంప్లెక్స్‌లో కొనసాగుతున్న ఆదర్శస్కూల్‌ను అక్కడి నుంచి తరలించేందుకు వీఎంఆర్‌డీఏ కోటిన్నర ప్రభుత్వ ధనాన్ని వెచ్చించి భవనం నిర్మించడం చర్చనీయాంశమైంది. ఏకంగా మూడంతస్తుల నిర్మాణానికి శ్లాబులు వేసి పాఠశాల యాజమాన్యానికి అప్పగించింది. దీంతో మిగిలిన పనులను పాఠశాల యాజమాన్యమే చేపడుతుందని స్థానికులు చెబుతున్నారు. ఆ భవనానికి ఏకంగా పాఠశాల బోర్డు కూడా ఏర్పాటు చేయడం విశేషం.

ప్రతిపాదనల్లోనే క్రీడా మైదానం

ఇదిలా ఉండగా ఓపెన్ స్పేస్‌లో ఈ ప్రాంత యువత కోసం క్రీడా మైదానం అభివృద్ధి చేయాలని రెండు దశాబ్దాల కిందట నిర్ణయించారు. వివిధ ఇబ్బందుల నేపథ్యంలో అది సాధ్యం కాలేదు. 15 ఏళ్ల కిందట మళ్లీ అదే ప్రతిపాదన రావడంతో అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టారు. క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేయడానికి అందులో ఉన్న పాఠశాలను తరలించాలని ప్రతిపాదనలు చేశారు.

తమకు లీజు సమయం ఉందని..

ఇప్పుడు ఖాళీ చేయలేమని ఆ పాఠశాల యాజమాన్యం చెప్పింది. తమకు వేరే స్థలం చూపిస్తే అప్పుడు ఖాళీ చేస్తామని స్పష్టం చేసింది.

దీనికోసం గత ఎమ్మెల్యేలు విఫలయత్నం చేశారు. వినాయకనగర్‌లో కాకుండా ఇతర ప్రాంతాల్లో స్థలం ఇస్తామని చెప్పడంతో ఆ పాఠశాల యాజమాన్యం నిరాకరించింది. చివరకు కోర్టును కూడా ఆశ్రయించింది. దీంతో వారి ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు.

దీనిపై రాజకీయ పైరవీలు కూడా చోటుచేసుకోవడంతో ఆ పాఠశాల కోసం భవనాన్నే నిర్మించి ఇవ్వాలని 2018లో నిర్ణయించారు. దానికనుగుణంగా భవన నిర్మాణం కూడా చేపట్టారు. అప్పట్లోనే మూడంతస్తులకు శ్లాబులు పూర్తి చేశారు. ఆ తరువాత ప్రభుత్వం మారడం.. భవన నిర్మాణంపై స్థానికుల నుంచి తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తం కావడంతో మిగిలిన పనులు నిలిచిపోయాయి. ఐదేళ్ల విరామం తర్వాత మళ్లీ యాజమాన్యం పనులు చేపట్టడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఆసక్తి వెనుక అంతరార్థం ఏంటో?

నాటి వుడా (వీఎంఆర్‌డీఏ)అధికారులు ఎక్కడా పాఠశాల భవనాలు కట్టిన దాఖలాలు లేవు. కానీ ఇక్కడి ఆదర్శ స్కూల్ కోసం ఏకంగా మూడంతస్తుల భారీ భవనం నిర్మించడం వెనక అంతరార్థం ఏంటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. విశాఖ స్టీల్‌ప్లాంట్ వంటి భారీ ప్రభుత్వరంగ సంస్థలు సైతం ప్రైవేట్ పాఠశాలలకు తమ స్థలాలను లీజుకు మాత్రమే ఇచ్చాయి. అలాంటిది ఒక ప్రైవేట్ పాఠశాలకు వీఎంఆర్‌డీఏ అధికారులు అత్యాధునిక భవనం నిర్మించి ఇవ్వాల్సిన అసరమేంటన్న ప్రశ్నలకు సమాధానాలు రావడం లేదు. లీజుకు తీసుకున్న పాఠశాల కోసం వీఎంఆర్‌డీఏ అధికారులు ఇంత మొత్తంలో ఎందుకు వెచ్చించారన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

అసలు విషయం ఏమిటంటే..!

వినాయకనగర్‌ను ఏర్పాటు చేసిన సమయంలో వుడా అధికారులు 5.22 ఎకరాలను భవిష్యత్ అవసరాల కోసం కేటాయించారు. అందులో కొన్ని దుకాణాలు కూడా నిర్మించారు. ఆ దుకాణాలను ఆదర్శ స్కూల్ యాజమాన్యం 33 ఏళ్లకు లీజుకు తీసుకొని పాఠశాల నిర్వహిస్తోంది.

ఆదర్శ స్కూల్‌కు భవనం కేటాయింపుపై హైకోర్టు స్టే

స్థానిక వుడా కాలనీ వినాయకనగర్‌లో ఆదర్శ స్కూల్‌కు అదే కాలనీలో మరో స్థలంతో పాటు భవనాన్ని వీఎంఆర్‌డీఏ కేటాయించడంపై ఏపీ హైకోర్టు స్టే జారీ చేసింది. వుడా లే అవుట్‌లో ప్రజోపయోగం కోసం కేటాయించిన సుమారు 1.52 ఎకరాల స్థలాన్ని ఓ ప్రైవేట్ సంస్థకు కేటాయించడంపై కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు హైకోర్టును ఆశ్రయించారు. ప్రజల అవసరాల నిమిత్తం కేటాయించిన స్థలాన్ని ప్రైవేట్ సంస్థలకు కేటాయిండం తగదని, వీఎంఆర్‌డీ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రాథమిక విచారణ చేసిన హైకోర్టు వీఎంఆర్‌డీఏ జారీ చేసిన ఉత్తర్వులను తాత్కాలికంగా రద్దు చేసింది. ప్రజోపయోగార్థం కేటాయించిన స్థలాలను ఇతర అవసరాలకు ఉపయోగించరాదని గతంలో సుప్రీం కోర్టు తీర్పు ఉన్న నేపథ్యంలో ఈ ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపివేస్తూ కోర్టు స్టే జారీ చేసింది. తదుపరి విచారణను ఈనెల 20వ తేదీకి వాయిదా వేసింది.


పాఠశాల యాజమాన్యం ఏర్పాటు చేసిన బోర్డు

క్లుప్తంగా

4న ఉక్కు కేవీలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయంలో ఈనెల 4న కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగ నియామకాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ వంశీకృష్ణ తెలిపారు. పీజీటీ విభాగంలో ఇంగ్లిష్, హిందీ, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, కామర్స్, ఎకనామిక్స్, కంప్యూటర్ సైన్స్ పోస్టులకు, టీజీటీ విభాగంలో ఇంగ్లిష్, హిందీ, సంస్కృతం, గణితం, సైన్స్, సోషల్ సైన్స్, ఇంకా పీఆర్‌టీ, కంప్యూటర్ ఇనస్ట్రక్టర్, స్పోర్ట్స్ కోచ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్, స్పెషల్ ఎడ్యుకేటర్, యోగా ఇనస్ట్రక్టర్, నర్స్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఆ రోజు ఉదయం 8.30 నుంచి దరఖాస్తుల స్వీకరణ, అనంతరం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలకు కేవీ వెబ్ సైట్ సందర్శించాలని ఆయన కోరారు.

4 నుంచి అమ్మవార్ల విగ్రహ ప్రతిష్టాపన

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో నూతనంగా నిర్మించిన దుర్గమాంబ, కుంచమాంబ అమ్మవార్ల విగ్రహ, శిఖర ప్రతిష్టాపన కార్యక్రమాలను ఈ నెల 4వ తేదీ నుంచి మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు శనివారం తెలిపారు. 4, 5వ తేదీల్లో హోమాలు, విశేష పూజలు, 6న మండప పూజలు, పీఠ పూజ, యంత్ర ప్రతిష్ట పూజ, విశేష లక్ష్మీ హోమం, కళాహోమం, శిఖర ప్రతిష్ట, మహా పూర్ణాహుతి పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీప్రతినిధులు తెలిపారు..

విద్యార్థులకు చేయూత అందివ్వాలి


పుస్తకాలు పంపిణీ చేస్తున్న దేవన్‌రెడ్డి

కూర్మన్నపాలెం: పేదవర్గాల విద్యార్థులకు చేయూత అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి పేర్కొన్నారు. కణితి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం చేకూరి ఫౌండేషన్ సమకూర్చిన పెన్నులు, పుస్తకాలను శనివారం ఆయన విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డగోవింద్, చిత్రాడ వెంకటరమణ, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు హరీష్‌వర్మ,స్థానిక నాయకులు తెన్నేటి రమణ, ఆడారి శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం


చైతన్య కాలేజీ వద్ద విద్యార్థుల సందడి

పెదగంట్యాడ: ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక వినాయకనగర్ వుడా కాలనీలోని చైతన్య కళాశాలలో నిర్వహించిన పరీక్షలకు మొత్తం 595 మంది హాజరు కావాల్సి ఉండగా 10 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల సందర్భంగా కళాశాల వద్ద సందడి నెలకొంది. ఉదయం 8.30 గంటల కల్లా పరీక్ష కేంద్రానికి హాజరు కావాలని సూచించడంతో 8 గంటల నుంచే పరీక్ష కేంద్రానికి ఒక్కొక్కరుగా వచ్చారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా రావడంతో ఆ ప్రాంతం కోలాహలంగా మారింది.

వేంకటేశ్వరుడికి విశేష పూజలు


తోమాలసేవకు పుష్పాలను తీసుకువస్తున్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో వేంకటేశ్వరునికి విశేష పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి స్వామికి సుప్రభాత సేవ, తోమాలసేవ నిర్వహించారు. సాయంత్రం విశేష పుష్పాలతో సహస్ర నామార్చన చేశారు. తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

వరసిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం


పూజలందుకుంటున్న వరసిద్ధి వినాయకుడు


వినాయకుడి పల్లకీ సేవలో భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–3 షాపింగ్ కాంప్లెక్స్‌లోని వరసిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. 19వ వార్షికోత్సవాల్లో భాగంగా వేకువజామున సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో పూజలు ప్రారంభమయ్యాయి. అనంతరం స్వామికి పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా రుత్వికుల ఆధ్వర్యంలో కలశస్థాపన, మండపారాధన, గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాసూత్రధారణలు నిర్వహించారు. పూజల్లో ఆలయ కమిటీ ప్రతినిధులతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఫ్రీ లెఫ్ట్ ... బీకేర్ ఫుల్

- నూతుల్లాంటి గోతులు
- ఫీట్లు చేస్తున్న ద్విచక్రవాహనచోదకులు


లంకెలపాలెం జాతీయ రహదారి ఫ్రీ లెఫ్ట్ మార్గంలో నూతుల్లాంటి గోతులు


ఫ్రీ లెఫ్ట్ డివైడర్ వద్ద కోరుకుపోయిన రహదారి

అగనంపూడి: జాతీయ రహదారి లంకెలపాలెం కూడలి వద్ద రాంకీ ఫార్మాసిటీకి వెళ్లేందుకు వీలుగా ఏర్పాటు చేసిన ఫ్రీ లెఫ్ట్ వద్ద నూతుల్లాంటి గోతులు వాహనచోదకులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. జాతీయ రహదారి అనకాపల్లి వైపు వెళ్లే కూడలిలో భారీ వాహనాలు బారులుతీరుతుండడంతో ఫార్మాసిటీ వైపు మళ్లేందుకు వీలుగా కూడలి వద్ద ఎడమ వైపు రోడ్డును వేరు చేశారు. ఈ మార్గంలో ఫార్మా కంపెనీలకు చెందిన వందలాది బస్సులు, వాహనాలతోపాటు హిందూజా పవర్ ప్లాంట్‌కు చెందిన బొగ్గు లారీలు, ఎన్టీపీసీ ఫ్లయాస్ లారీలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ఫ్రీ లెఫ్ట్ ఉన్న 20 మీటర్ల నిడివిలో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. మలుపు వద్ద రోడ్డు పూర్తిగా కోరుకుపోయింది. దీంతో కొద్దిపాటి దూరం ద్విచక్రవాహనచోదకుడు ప్రయాణం చేయడానికి అవస్థలకు గురవుతుండడంతో పాటు గోతుల్లో వాహనం పడితే ఫీట్లు చేస్తూ వాహనాలు పల్టీ కొడుతున్నాయి. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు స్పందించి గోతులు పూడ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

హెచ్‌ఆర్‌ఏ ఏరియర్స్‌తో సహా చెల్లించాలి


స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పాండేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు నిలిపివేసిన హెచ్‌ఆర్‌ఏ ఏరియర్స్‌తో సహా చెల్లించాలని స్టీల్ టీఎన్‌టీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం నాయకులు స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండేను కలిసి వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులకు గతేడాది సెప్టెంబర్ నుంచి హెచ్‌ఆర్‌ఏ నిలిపివేశారన్నారు. అదే విధంగా టౌన్‌షిప్‌లో నివసిస్తున్న ఉద్యోగుల విద్యుత్ చార్జీలను గణనీయంగా పెంచారన్నారు. దీనిపై యాజమాన్యం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు, స్టీల్ టీఎన్‌టీయూసి ప్రధానకార్యదర్శి నమ్మి సింహాద్రి, అధ్యక్షుడు జి. నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం వేలం

గాజువాక: పౌర సరఫరాల శాఖ సర్కిల్–3 అధికారులు తమ దాడుల్లో పట్టుబడ్డ రేషన్ బియ్యాన్ని వేలం వేశారు. అక్రమంగా తరలిస్తున్న 16 టన్నుల రేషన్ బియ్యంను అధికారులు దాడి చేసి పట్టుకున్న విషయం తెలిసిందే. ఈ బియ్యానికి శనివారం నిర్వహించిన వేలంలో కేజీ రూ.26.50 చొప్పున నర్సీపట్నం ప్రాంతానికి చెందిన ఒక వ్యాపారి పాడుకున్నట్లు అధికారులు తెలిపారు. నగదు చెల్లించిన వెంటనే ఆ బియ్యం వ్యాపారికి అందజేయనున్నట్టు పేర్కొన్నారు.

తాగునీరు వృథాను అరికట్టండి

కూర్మన్నపాలెం: అధికారుల అలసత్వం కారణంగా తాగునీరు వృథా అవుతోంది. 86వ వార్డు వుడానగర్ ఫేజ్–1లో కొంతకాలంగా పైపులైన్ లీకై తాగునీరు వృథాగా పోతుంది. అసలే వేసవి కావడం వల్ల నీరు అందక ప్రజలు విలవిల్లాడుతున్నారు. ఇలాంటి సమయంలో కూడా ట్యాంకులోని నీరు మొత్తం పైపు ద్వారా కాలువలో కలిసిపోతుంది. ఈ విషయంపై అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి మంచినీరు వృథాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.


వుడానగర్‌లో కాలువలో కలిసిపోతున్న మంచినీరు

క్రీడల్లో రాణిస్తే ఉన్నత భవిష్యత్తు


పవర్ లిఫ్టింగ్ పోటీలను ప్రారంభిస్తున్న అండిబోయిన లక్ష్మి

పెదగంట్యాడ: క్రీడాకారుల్లో ఉత్సాహం నింపేందుకు క్రీడాపోటీలు దోహదం చేస్తాయని హైకోర్టు న్యాయవాది అండిబోయిన లక్ష్మి అన్నారు. ఏపీ స్టేట్ పవర్ లిఫ్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అండిబోయిన అప్పారావు, మరలా భాస్కరరావు ఆధ్వర్యంలో పెదగంట్యాడ సీడబ్ల్యూసీలో 4వ ఏపీ స్టేట్ డెడ్ లిఫ్ట్ చాంపియన్ షిప్–2025, సెవెన్త్ ఏపీ స్టేట్ బెంచ్ ఛాంపియన్‌షిప్–2025 పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. వివిధ జిల్లాల సుమారు 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ 1,2,3 మెన్ అండ్ ఉమెన్ విభాగాల్లో రెండు రోజుల పాటు పోటీలు నిర్వహించనున్నామని వివరించారు. విజేతలకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్లను ప్రదానం చేయనున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అనురాధ, పేర్ల సత్యారావు, రాంబాబు, రేష్మ, అప్పారావు, పుల్లయ్య, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

చైతన్యంతో మహిళా సాధికారిత


న్యాయవాదులను సత్కరిస్తున్న అధ్యాపకులు

అగనంపూడి: మహిళా జాగృతితో సాధికారిత సాధ్యమని, విద్యార్థి దశలో మహిళలు సమాజంలో ఎదుర్కొంటున్న సవాళ్లు, సమస్యలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలని న్యాయవాదులు జి.మోహనరావు, ఎంఎస్‌పీ మాధురి అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లు, చైతన్యం, హక్కులపై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. మహిళలపై నేటికీ అఘాయిత్యాలు, దాడులు జరగుతున్నాయంటే హక్కులు, చట్టాలపై అవగాహన లేకపోవడమే కారణమన్నారు. మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తే మహిళలకు ఏ సందర్భంలోనూ అన్యాయం జరగదన్నారు. కార్యక్రమంలో కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్లేస్‌మెంట్ అండ్ ట్రైనింగ్ డీన్ బొడే ప్రసాద్, కోఆర్డినేటర్లు మణి, లేఖశ్రీ పాల్గొన్నారు.

గైస్ అభివృద్ధికి సంపూర్ణ సహకారం


మాట్లాడుతున్న కెమ్‌దోసా గౌరవాధ్యక్షుడు రంగారావు

మురళీనగర్: కెమికల్ ఇంజినీరింగు ఇన్‌స్టిట్యూట్ (గైస్) అభివృద్ధికి కెమికల్ ఇంజినీరింగ్ డిప్లమా పూర్వ విద్యార్థుల సంఘం (కెమ్‌దోసా) సంపూర్ణ సహకారం అందిస్తుందని సంఘం గౌరవాధ్యక్షుడు పీవీ రంగారావు తెలిపారు. కెమ్‌దోసా 9వ వార్షికోత్సవాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. కాలేజీలో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే అనేక సదుపాయాల కల్పనలో సహాయం అందించినట్లు చెప్పారు. గైస్‌లో విద్యనభ్యసించిన ప్రతి పూర్వ విద్యార్థి తాము చదువుకున్న కాలేజీ రుణం తీర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా గైస్‌లోని నాలుగు బ్రాంచ్‌ల్లో ప్రతిభా వంతులైన విద్యార్థులకు రూ.1.30 లక్షల బహుమతులను కెమ్‌దోసా తరుపున అందించారు. కెమ్‌దోస అధ్యక్షుడు ఏ.వరహాలు, కోఆర్డినేటర్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు ప్రసంగించారు.

అవే సెంటర్లు.. అవే కష్టాలు


చైతన్యనగర్‌లో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల రద్దీ


విద్యార్థులతో కిక్కిరిసిపోయిన రోడ్డు

- చైతన్యనగర్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు
- ఇంటర్ విద్యార్థులకు తప్పని అవస్థలు

గాజువాక: ఇరుకురోడ్లలో ఉన్న కళాశాల్లో ఇంటర్ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడంతో విద్యార్థులు అవస్థలకు గురయ్యారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమైన నేపథ్యంలో గాజువాక చైతన్యనగర్‌ని వీధిరోడ్లు, ప్రధాన రహదారి కిటకిటలాడింది. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు వెళ్లేందుకు అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. చైతన్యనగర్‌లో మొత్తం ఆరు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలన్నీ పక్కపక్కనే ఉన్నాయి. ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభం కానున్న పరీక్షల కోసం విద్యార్థులు ఎనిమిది గంటల నుంచే పరీక్షా కేంద్రాలకు రావడం ప్రారంభించారు. ఈ కేంద్రాల్లో రెండు వేల మందికిపైగా విద్యార్థులు పరీక్షలు రాసేందుకు వచ్చారు. వారివెంట తల్లిదండ్రులు కూడా వచ్చారు. అదే సమయంలో విధులకు వెళ్లేవారు కూడా రాకపోకలు సాగించడంతో గాజువాక జాతీయ రహదారికి, కణితి రోడ్డు మధ్యలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఆ ప్రాంతంలోనే అనేక పాఠశాలలు కూడా ఉన్నాయి. స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు కూడా అదే సమయంలో రావడంతో ఈ సమస్య జఠిలంగా మారిపోయింది. దీంతో అటు విద్యార్థులు, ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. కాగా, తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది పరీక్షా కేంద్రాల్లో సుమారు 2400 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్టు అధికారులు పేర్కొన్నారు.

అప్పుడే.. భగ భగ

- మార్చి ఆరంభంలోనే మొదలైన వేడి


ఎండ కారణంగా నిర్మానుష్యంగా ఉన్న పెదగంట్యాడ ప్రధాన రహదారి

పెదగంట్యాడ: వేసవి కాలం ఆరంభంలోనే ఎండల తీవ్రత పెరిగింది..రోజురోజుకూ భానుడు భగభగమంటున్నాడు. ఫిబ్రవరి రెండో వారం నుంచే ఎండలు ముదరడం ప్రారంభించాయి. ఇక ముందు ముందు పరిస్థితి ఎలా ఉంటుందోనని జనం ఆందోళన చెందుతున్నారు. సాధరణంగా శివ రాత్రి తర్వాత కొద్దికొద్దిగా ఎండలు ముదురుతాయి. కానీ ఈ ఏడాది శివరాత్రికి నెల ముందు నుంచే ఎండలు తీవ్రత పెరిగింది.

35 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత

మండలంలో పగటి ఉష్ణోగ్రత 35 డిగ్రీలు దాటింది. దీంతో రాత్రి పూట చలి తీవ్రత తగ్గి ఉక్కపోత ప్రారంభమైంది. మండలంలో ఎండలు తీవ్రత పెరగడంతో ఇక ఏసీలు, కూంర్లకు గిరాకీ పెరుగుతున్నాయి. గతేడాది ఈ సమయానికి ఇంత ఎండ లేదని. మార్చి నెల చివరి నాటికి ఈ ఏడాది 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

విద్యార్థులూ జర భద్రం

ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలి. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. పరీక్షలు ఉదయమే ప్రారంభం అవుతాయి కనుక ఎండ తీవ్రత కొద్దిగా తక్కువ ఉన్నా పరీక్ష ముగిసే సమయానికి మాత్రం ఎండలు పెరిగే అవకాశం ఉంటుంది.. విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకుని ఎండల తీవ్రత నుంచి తప్పించుకోవల్సిన అవసరం ఎంతైనా ఉంది..

తీసుకోవాల్సిన జాగ్రత్తలు



బయటకు వెళ్లేటప్పుడు తప్పకుండా గొడుగు లేదా టోపీ వాడాలి . తెలుపురంగు, పలచటి దుస్తులు పాటు లూజుగా ఉండేలా ఉన్న వస్త్రాలనే వాడాలి.ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్యలో బయట తిరగకూడదు. ఎక్కువగా నీరు తాగడం, నీటిశాతం ఎక్కువగా ఉండే పండ్లను తీసుకోవడం మంచిది.

– డాక్టర్ మానస, వైద్యాధికారి ,యూపీహెచ్‌సీ సిద్ధేశ్వరం.